

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

బలివేలో రాజకీయ పార్టీ నేతల బ్యానర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - ముసునూరు



మండలంలోని బలివే గ్రామంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. రాజకీయ నాయకుల బ్యానర్లను ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోలేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. బలివే గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా తెలుగుదేశం పార్టీ బ్యానర్లను ప్రధాన సెంటర్ కూడళ్లలో ఏర్పాటు చేశారు. ఎంఎల్‌సి కోడ్ ఉండగా రాజకీయ పార్టీ బ్యానర్లు ఏర్పాటు చేయడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు కూడా పట్టించుకోవడంలేదని విమర్శలు చేస్తున్నారు.

ఓటుకు వేళాయె..!

పట్టభద్రుల ఎంఎల్‌సి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
నేడు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
రెండు జిల్లాల్లో 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
ఓటుహక్కును వినియోగించుకోనున్న 3,14,984 మంది
ఓటర్ల సౌలభ్యం కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 1950, టోల్ ఫ్రీ నెంబర్ 18002331077
ఎన్నికల విధుల్లో 2,714 మంది సిబ్బంది
3,421 మందితో పోలీస్ బందోబస్తు
పిడిఎఫ్, టిడిపి మధ్యే ప్రధాన పోటీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ జరగనుంది. పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లనూ అధికారులు పూర్తి చేశారు. బుధవారం ఏలూరులోని స్థానిక గిరిజన భవన్‌లో, జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో సామగ్రిని సిబ్బందికి అందించారు. ఈ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటుహక్కు వినియోగించుకునేందుకు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 3,14,984 మంది పట్టభద్రుల ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు సైతం పకడ్బందీగా చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎన్నికల నిర్వహణలో 545 మంది ప్రిసైడింగ్ అధికారులు, 545 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1,080 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని, 544 మంది మైక్రోఅబ్జర్వర్లు మొత్తం 2,714 మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 70 మంది జోనల్ అధికారులను, 99 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. రెండు జిల్లాల్లోనూ డిఎస్‌పి, సిఐ, ఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మొత్తం 3,421 మంది పోలీసులు ఎన్నికల బందోబస్తు నిర్వహించనున్నారు. మొత్తం 1,199 బ్యాలెట్ బాక్సులు కేటాయించారు. గురువారం సాయంత్రం నాలుగు గంటల వరకు డ్రై డేగా మద్యంపై నిషేధం కొనసాగనుంది. ఓటర్లు తమ సమస్యలపై ఫిర్యాదులు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 18002331077, ఓటర్లు తమ ఓటు, పోలింగ్ స్టేషన్ వివరాలు తెలుసుకునేందుకు హెల్ప్‌లైన్ నెంబర్ 1950 ఏర్పాటు చేశారు.

పోటీలో
ఉన్న అభ్యర్థులు: 35 మంది
మొత్తం ఓటర్లు: 3,14,984 మంది
పోలింగ్ కేంద్రాలు: 456
ఎన్నికల సిబ్బంది: 2,714 మంది
పోలీస్ సిబ్బంది: 3,421 మంది



సిద్ధం చేసిన బ్యాలెట్ బాక్సులు

ఇద్దరి మధ్యే ప్రధాన పోటీ

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఇద్దరి మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ సాగుతోంది. ఎన్నికల ప్రచారం సైతం హోరాహోరీగా సాగింది. టిడిపి అభ్యర్థి గెలుపు కోసం సిఎం నుంచి కిందిస్థాయి కూటమి కార్యకర్తల వరకూ పని చేసిన పరిస్థితి ఉంది. పిడిఎఫ్ అభ్యర్థి తరపున ఉద్యోగులు, నిరుద్యోగులు, పలు ప్రజాసంఘాలు ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. ఇద్దరి మధ్య గట్టి పోటీ నెలకొనడంతో గెలుపోటములపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఏలూరులోని సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, వట్లూరులో కౌంటింగ్ ప్రక్రియ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులన్నీ ఏలూరు సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరనున్నాయి.

కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎన్నికకు 21 పోలింగ్ కేంద్రాలు

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఏలూరు జిల్లాలో కైకలూరు, నూజివీడు నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం ఎనిమిది మండలాల్లో 21 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,099 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు 150 మంది సిబ్బందిని నియమించారు. పోలింగ్‌కు 80 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. గురువారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు.

ఓటేసేందుకు వెళ్తున్నారా..!

-పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లు వినియోగిస్తారు.
-పోలింగ్ కేంద్రానికి తగిన గుర్తింపు పత్రంతో వెళ్లి అధికారులకు చూపించి ఓటరు గుర్తింపు ఉన్న పత్రంపై ఓటరు పేరు వద్ద సంతకం చేస్తే అనంతరం బ్యాలెట్ పేపరు అందిస్తారు.
-బ్యాలెట్ పేపర్లో అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి.
-బ్యాలెట్ పేపర్లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్ మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది.
-ప్రాధాన్యతాక్రమంలో వారికి నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా గల గడిలో 1 అని అంకెను వేయాల్సి ఉంటుంది.
-ఆ తర్వాత ఇష్టమైన వారికి ప్రాధాన్యతను అనుసరించి 2, 3, 4 అంకెలు వేయవచ్చు.
-ఒకే అంకెను (నెంబరు) ఇద్దరికి వేయకూడదు. అలా వేస్తే ఆ ఓటు చెల్లదు.
-అలాగే ఓటు వేసేటప్పుడు 1 అంకె వేయకుండా 2, 3, 4 వేస్తే ఓటు చెల్లదు
- అంకెలు కాకుండా రోమన్ సంఖ్యలు వేసినా ఓటు చెల్లదు. అక్షరాలు రాసినా చెల్లుబాటు కాదు.
-ఎన్నికల సంఘం సూచించిన ఏదోక గుర్తింపు కార్డును తప్పక తీసుకెళ్లాలి.

ఓటేసేందుకు తీసుకెళ్లాల్సిన గుర్తింపు కార్డులు

1.ఆధార్, 2.పాన్‌కార్డు, 3.విభిన్నప్రతిభావంతుల సర్టిఫికెట్, 4.ఓటరు గుర్తింపు కార్డు, 5.పాస్‌పోర్టు, 6.డ్రైవింగ్ లైసెన్స్ 7.ఏపార్టుమెంట్ ఫొటో గుర్తింపు కార్డు, 8.జాతీయ ఉపాధి హామీ జాబ్‌కార్డు, 9.బ్యాంకులు, తపాలా శాఖ జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, 10.పెన్షన్ డాక్యుమెంట్ తదితరాలైన ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదోకటి తీసుకెళ్లాలి.

శివరాత్రి వేళ విషాదం

తమ్మిలేరులో స్నానానికి దిగి ఇద్దరు సోదరులు మృతి
శోకసంద్రమైన తిమ్మక్కపాలెం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ఇద్దరు సోదరులు తల్లిదండ్రులతో కలిసి మహాశివరాత్రి సందర్భంగా బలివే ఆలయానికి వెళ్లారు. సోదరులిద్దరూ తాము స్నానం చేసి వస్తామని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లారు. వారు అక్కడకు సమీపంలోని పెదవేగి మండలం నడిపల్లి వద్ద తమ్మిలేరులో స్నానానికి దిగి గల్లంతయ్యారు. ఈ విషయం తెలిసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. లింగపాలెం మండలం తిమ్మక్కపాలెం గ్రామానికి చెందిన మురళీ, మంగమ్మ దంపతులకు మునియా(24) మారేషు (22) ఇద్దరు కుమారులు ఉన్నారు. మునియకు, మారేషుకు ఇంకా వివాహం కాలేదు. బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని కుటుంబసమేతంగా ముసునూరు మండలం బలివే వెళ్లారు. మురళీ, మంగమ్మ ఆలయం వద్ద ఉండగా తాము స్నానం చేసి వస్తామని సోదరులిద్దరూ తల్లిదండ్రులకు చెప్పి అక్కడకు సమీపంలోని పెదవేగి మండలం నడిపల్లి గ్రామ శివారులోని మునిపల్లి వద్ద తమ్మిలేరులోకి దిగారు. స్నానం చేస్తుండగా ఇద్దరు సోదరులు ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కొంతసేపటికి ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇద్దరు కుమారులు విగత జీవులుగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు యువకుల మృతితో తిమ్మక్కపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పెదవేగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాబాయ్‌ను కాపాడేందుకు వెళ్లి..!

చెరువులో స్నానానికి దిగి ఊబిలో ఇరుక్కున్న బాబాయ్
కాపాడేందుకు దిగిన కుమారుడు కూడా గల్లంతు
గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్



వెంకటేశ్వరరావు (ఫైల్)



సుబ్రహ్మణ్యం (ఫైల్)

సరదాగా చెరువులో స్నానానికి దిగి ఊబిలో దిగబడిన తన బాబాయ్‌ను కాపాడేందుకు వెళ్లిన అబ్బాయి కూడా బాబాయ్‌తో పాటు గల్లంతయ్యాడు. ఈ ఘటన ఏలూరు నగరంలోని వట్లూరులో చోటు చేసుకుంది. సంబంధిత వివరాల ప్రకారం.. ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధి వట్లూరు గ్రామానికి చెందిన బజ్జవరపు వెంకటేశ్వరరావు (55) భార్య పిల్లలతో కలిసి జీవనాన్ని సాగిస్తున్నాడు. ఇతను కుల వృత్తి అయిన చాకలి పని చేస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం వెంకటేశ్వరరావు స్నానం చేసేందుకు చెరువులో దిగాడు. ఇదే సమయంలో అతని అన్నయ్య కోటేశ్వరరావు కుమారుడు బజ్జవరపు సుబ్రహ్మణ్యం (30) చెరువు గట్టుపై ఉన్నాడు. స్నానానికి దిగిన వెంకటేశ్వరరావు హఠాత్తుగా చెరువులో ఉన్న ఊబిలో ఇరుక్కుపోయాడు. ఇది గమనించిన సుబ్రమణ్యం తన బాబాయ్‌ను కాపాడేందుకు చెరువులోకి దిగాడు. అతడిని కాపాడుతున్న సమయంలో వెంకటేశ్వరరావుతో పాటు సుబ్రహ్మణ్యం కూడా ఊబిలో ఇరుక్కుపోయాడు. ఇద్దరు చెరువులో గల్లంతయ్యారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన వారికోసం వెతుకులాట ప్రారంభించారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో మూడో పట్టణ ఎస్‌ఐ రాంబాబు గాలింపు చర్యలు చేపట్టారు.

పోలింగ్ ప్రక్రియ అత్యంత కీలకం

ఎన్నికల సామగ్రి అంతా సరిచూసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియ ప్రధానమైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. బుధవారం స్థానిక గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల పోలింగ్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ మెటీరియల్ తీసుకున్న పోలింగ్ అధికారులను, సిబ్బందిని ఎన్నికల సామగ్రి అంతా తీసుకున్నారా, లేదా అని పరిశీలించారు. చెక్ లిస్టు ప్రకారం ఎన్నికల సామగ్రిని అంతా సరిచూసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సుల పనితీరును పరిశీలించుకోవాలన్నారు. ఎన్నికల విధులకు నియమించిన సిబ్బంది అందరూ హాజరయ్యారా, లేదా అని ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్‌ను ఆరా తీశారు. ఎవరైనా హాజరుకాకపోతే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బందికి ఎక్కడ డ్యూటీలు వేశారో అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ పేపర్లను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. వాటిని ఏవిధంగా మడిచి బ్యాలెట్ బాక్సులో ఓటరు వేసే విషయంపై అవగాహన కల్పించారు. పోలింగ్ నిర్వహించే తీరును పోలింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరిన పిదప అక్కడ పోలింగ్ ఏర్పాట్లను చేసుకోవాలన్నారు. పోలింగ్ నిర్వహణలో ఏమైనా సందేహాలు ఉన్నాయా అని పోలింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల నిర్వహణకు అందరూ సమర్థవంతంగా పని చేయాలని పోలింగ్ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ వెంట ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, తహశీల్దారు శేషగిరి తదితరులు ఉన్నారు.

గిరిజన భవన్‌లో ఏలూరు డివిజన్‌లోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పోలింగ్ మెటీరియల్ పంపిణీ జరిగింది. డివిజన్‌లోని 43 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పోలింగ్ నిర్వహించడానికి అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర మెటీరియల్‌ను తీసుకుని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మొత్తం ఎనిమిది రూట్లలో ఎనిమిది బస్సుల్లో పోలింగ్ సిబ్బంది, సామగ్రి ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా అధికారులు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వర్‌తోపాటు ప్రతి రూట్‌లో ఒక రూట్ ఆఫీసర్, పోలీసు సిబ్బంది ఆయా బస్సుల్లో బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. సిబ్బందికి మధ్యాహ్న భోజనం పంపిణీ కేంద్రం వద్ద ఏర్పాటు చేశారు. అయితే ఎంతో బరువుగా ఉన్న బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర సామగ్రి ఉన్న పెద్దపెద్ద సంచులను ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది స్వయంగా మోసుకుని బస్సుల వద్దకు వెళ్లాల్సి రావటంతో సిబ్బంది కాస్త ఇబ్బంది పడ్డారు. సార్వత్రిక ఎన్నికలప్పుడు ఎన్నికల సామగ్రి బస్సుల వద్దకు చేర్చేందుకు ప్రత్యేక మనుషులను ఏర్పాటు చేశారని, ఇప్పుడు అలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో తామే మోయాల్సి వస్తుందని మహిళా సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం మీద ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ సజావుగా సాగింది.



పోలింగ్ సామగ్రితో బయల్దేరిన సిబ్బంది

ఘనంగా ఆశ్రం 25వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖులు

ఆశ్రం మెడికల్ కాలేజీ 25వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం కాలేజీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డిఎస్‌విఎల్.నరసింహం హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత డాక్టర్ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ కళాశాల ప్రారంభించి 25వ సంవత్సరం పూర్తయిందని, ఆశ్రం వైద్య కళాశాల ద్వారా ఎంతోమంది విద్యార్థులు వివిధ విభాగాల్లో నిష్ణాతులై, ప్రపంచ నలుమూలల వైద్య సేవలు అందించడం తమకెంతో గర్వకారణమని అన్నారు. అనంతరం నరసింహం మాట్లాడుతూ ఆశ్రం కళాశాల క్షేత్రస్థాయిలో సామాన్యునికి వైద్య విద్య అందించడంలో ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. మెడికల్ కాలేజీగా ఎన్ఎబిహెచ్, ఎన్ఎబిఎల్, ఎన్ఎసి గుర్తింపు కలిగి ఉండటం కాలేజీ పాటిస్తున్న ప్రమాణాలకు నిదర్శనమని అభినందనలు తెలిపారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రం సంస్థల ముఖ్య పరిపాలన అధికారి డాక్టర్ హనుమంతరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చేబ్రోలు శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ రాజు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శాంతయ్య, కళాశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులు తవ్వేద్దాం - మట్టిని తరలించేద్దాం

ఆక్వా మోజుతో పంట భూములకు ఎసరు
నిబంధనలకు నీళ్లు- అధికారులకు మామూళ్లు
ముదినేపల్లిలో తవ్వకాల జోరు- మట్టి తోలకాల హోరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆక్వా మోజుతో సారవంతమైన వరి పొలాలు ఆక్వా చెరువులుగా మారిపోతున్నాయి. వేసవి వచ్చిందంటే చాలు ప్రతి ఏటా ఎకరాకు 40 బస్తాల పైబడి పండే వరి భూములు రొయ్యల, చేపల చెరువులుగా రూపాంతరం చెందుతున్నాయి. వ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నా అధికారుల అలసత్వం, కాసుల కక్కుర్తి వెరసి చెరువుల తవ్వకాలు మూడు పువ్వులు- ఆరు కాయలుగా అన్న చందన సాఫీగా సాగిపోతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ అక్రమంగా ఆక్వా చెరువుల తవ్వకాలు, మట్టి తోలకాలు జోరుగా సాగుతున్నా అడ్డుకోవాల్సిన అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. సాధారణంగా సాగుకు అనువు కాని బీడు భూములను మాత్రమే చెరువులుగా తవ్వాల్సి ఉంది. చెరువు తవ్వటానికి ముందస్తు అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే మండల స్థాయి కమిటీ పరిశీలన తదుపరి డిఎల్‌సి అనుమతి పొందాల్సి ఉంది. రెవెన్యూ, వ్యవసాయం, డ్రెయినేజీ, మత్స్య, భూగర్భ జల వనరుల శాఖల అధికారులు కమిటీలో ఉంటారు. అధికారులు మార్కింగ్ ఇచ్చిన తరువాతనే తవ్వకం పనులు మొదలు పెట్టాల్సి ఉంది. తవ్వకం పూర్తయిన తర్వాత అంత సక్రమమే అని అధికారులు నిర్ధారించిన అనంతరమే చెరువులకు నీటిని నింపాల్సి ఉంది. కాని మండలంలో ఈ నిబంధనలు అమలయ్యే పరిస్థితి మచ్చుకైనా ఎక్కడా కానరావడం లేదు. ఆక్వా చెరువుల తవ్వకం దారులతోనూ, మట్టి తోలకందారులతోనూ రెవెన్యూ కార్యాలయం కిటకిటలాడుతోంది. నేషనల్ హైవే విస్తరణ పనులు సాగుతుండడంతో తెల్లని ఇసుక మట్టికి గిరాకీ ఏర్పడింది. ఇటీవల పెదగొన్నూరు, వైవాక, బొమ్మినంపాడు గ్రామాల్లో భూములను చెరువులుగా మార్చి హైవేకు మట్టిని తరలించారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది. మండలం నుంచి రేయింబవళ్లు మట్టి తోలకాలు టిప్పర్ల ద్వారా సాగుతున్నాయి. సాక్షాత్తు మండల రెవెన్యూ కార్యాలయం ముందు నుంచి ఈ టిప్పర్లు నిత్యం మట్టి లోడుతో వెళు..న్న అధికారుల అడ్డుకున్న పాపాన పోలేదు. మట్టి తోలకానికి తొలుత స్థానిక రెవెన్యూ కార్యాలయానికి దరఖాస్తు చేసుకుంటే వారి నుంచి మైనింగ్ శాఖకు వెళ్తుంది. అధికారుల పరిశీలన తదుపరి మైనింగ్ బిల్లులుతో నిర్దేశించిన వాహనాలతోనే మట్టిని తరలించాలి. మండలంలో జనవరి నుంచి మట్టి తోలకాలు, చెరువుల తవ్వకాలు సాగుతున్నాయి.




వణుదుర్రులో మట్టి తవ్వి లారీల్లో లోడ్ చేస్తున్న పొక్లెయిన్

మండలంలోని పలు గ్రామాల నుంచి మట్టి తోలకాలు ట్రాక్టర్ల ద్వారా కూడా సాగుతున్నాయి. నిబంధనలు వీరికి వర్తించదు. అధికారులకు అక్రమాలు కానరావు. మట్టి తోలకం దారులనుంచి, అక్రమ ఆక్వా చెరువుల తవ్వకం దారుల నుంచి ప్రత్యేక ప్యాకేజీలు అధికారులకు అందుతున్నాయనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినవస్తున్నాయి. మండల రెవెన్యూ యంత్రాగం అక్రమాలను భారీగానే సొమ్ము చేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో జరుగుతున్న ఆక్వా చెరువుల తవ్వకాలు, మట్టి తోలకాలు విషయమై రెవెన్యూ అధికారులను, విఆర్‌ఒలను వివరణ అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. మండలంలోని వణుదుర్రులో జరుగుతున్న అక్రమ చెరువుల తవ్వకం, మట్టి అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులకు తవ్వకాలు నిలుపుదల చేయాలంటూ ఎన్ని ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకోవటం లేదు. దీంతో మట్టి మాఫియా పెట్రేగిపోతూ మట్టిని టిప్పర్ల ద్వారా తరలించుకుపోయి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటూ మట్టి మాఫియా జల్సాగా జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి ముదినేపల్లి మండలంలో జరుగుతున్న అక్రమ చెరువుల తవ్వకాలు మట్టి అక్రమ తోలకాలను నిలుపుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ, ఆయా గ్రామాల ప్రజలు జిల్లా స్థాయి అధికారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు



పోలవరం మండలం పట్టిసీమ ఆలయం బయట క్యూలైన్ యాత్రికుల రద్దీ



ముసునూరు మండలం బలివే స్నానాల ఘాట్ వద్ద యాత్రికులు

..వార్త 6లో

అంతర్ జిల్లా పోటీలకు కృష్ణశేషసాయి

పలువురి అభినందన



కృష్ణశేషసాయి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని అమ్మవారితోట ప్రాంతానికి చెందిన విద్యార్థి పోలుకొండ కృష్ణశేషసాయి ఉమ్మడి కృష్ణ జిల్లా ఫెన్సింగ్ శాబర్ బాలుర విభాగంలో రాణించి అంతర్ జిల్లాల పోటీకి ఎంపికయ్యాడు. వీరులపాడు మండలం పొన్నవరం ఏకత్వ పాఠశాలలో ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. అంతర్ జిల్లాల పోటీకి ఎంపికైన కృష్ణశేషసాయిని పట్టణంలోని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. కృష్ణశేషసాయి తండ్రి పురుషోత్తమదేవ్ రైతు. తల్లి నాగలక్ష్మి లైబ్రేరియన్, సోదరుడు గోకుల్ సెకండర్ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. కృష్ణశేషసాయి ఫెన్సింగ్ క్రీడలో శిక్షణ పొందేందుకు కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. తోటి విద్యార్థులు సైతం ప్రోత్సహిస్తున్నారు.

ఓటు హక్కు వినియోగంలో సూచనలు పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఎన్నికల నిమిత్తం, ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది ఫారం-12లో నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఉన్నారో వారందరికీ పోస్టల్ బ్యాలెట్ పత్రాలు పోస్ట్ ద్వారా వారి చిరునామాలకు (ఫారం-12లో కోరిన విధంగా) పంపినట్లు పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, డిసిఒ శ్రీనివాస్ తెలిపారు. ఈ పోస్టల్ బ్యాలెట్ పత్రాలను అందుకున్న ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది నిర్దేశించిన విధంగా ఓటు హక్కును వినియోగించుకుని, వారి పోస్టల్ బ్యాలెట్‌ను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ మార్చి 3వ తేదీ ఉదయం 7.59 గంటల్లోపు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని తప్పనిసరిగా అందేటట్టు పంపాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో పలు సూచనలను పాటించాలన్నారు. ఫారం-13 డిక్లరేషన్‌లో బ్యాలెట్ పేపర్ వరుస సంఖ్య నమోదు చేసి, వారి సంతకం చేసి, చిరునామా రాయాలి. సదరు డిక్లరేషన్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి సదరు గెజిటెడ్ అధికారి హోదా చిరునామాతో కూడిన స్టాంపు, తేదీ వేయించుకోవాలి. పంపిన పోస్టల్ బ్యాలెట్ పత్రాల్లో వారి ప్రాధాన్యత క్రమంలో పెన్నుతో 1, 2, 3 అంకెలను మాత్రమే వేయాలని, టిక్ పెట్టడం వంటివి చేయకూడదన్నారు. మొదటి ప్రాధాన్యం ఇవ్వాలనుకున్న అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న గడిలో 1 అంకెను వేయాలని, 1 అంకె తరువాత మిగతా అభ్యర్థులకు వారి ప్రాధాన్యత క్రమంలో 2, 3 అంకెలను వేయాలని తెలిపారు. అభ్యర్థుల్లో కచ్చితంగా 1 అంకెను ఎవరికైనా వేయాలన్నారు. మిగతా అభ్యర్థులకు వేయదలచిన అంకెలు వేయాలి. ప్రాధాన్యత నమోదు చేసిన బ్యాలెట్ పత్రాన్ని చిన్న కవర్ పోస్టల్ బ్యాలెట్ పేపర్ అని రాసిన కవర్ ఎ (ఫారం-13బి)లో ఉంచి, సదరు కవరును మూసి వేయాలన్నారు. ఈ కవరుపై బ్యాలెట్ పత్రం నంబర్ మాత్రమే ఉంచాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పత్రం ఉంచిన చిన్న కవర్ (కవర్-ఎ), డిక్లరేషన్‌ను విడివిడిగా పెద్ద కవర్‌లో కవర్ బి (ఫారం - 13 సి)లో ఉంచి, రిటర్నింగ్ అధికారికి పోస్ట్ ద్వారా, లేదా స్వయంగా అందేటట్టు పంపించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ సహాయక కేంద్రంలో వీటిని స్వయంగా అందించవచ్చన్నారు. కౌంటింగ్‌కు ముందు మార్చి 3వ తేదీ ఉదయం 07.59 లోపు ఈ పోస్టల్ బ్యాలెట్ అందేటట్టు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

హమాలీల కూలి రేట్లపై జిఒ విడుదల చేయాలి

4, 7 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

హమాలీల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు

పెంటపాడు : సివిల్ సప్లయిస్ హమాలీలకు పెరిగిన కూలీరేట్లు, 14 నెలల ఏరియర్స్ చెల్లింపుకు వెంటనే జిఒలు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 4వ తేదీన మండల కార్యాలయాలు, 7వ తేదీన విజయవాడ ఎండి కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు హమాలీల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. పత్తిపాడు సివిల్ సప్లయిస్ గోడౌన్స్ వద్ద గత నవంబర్ 20వ తేదీన కూలీరేట్లు క్వింటాల్‌కి రూ.25 నుంచి 28కు పెంచేందుకు ప్రభుత్వానికి హమాలీ కార్మిక సంఘాల మధ్య ఒప్పందం జరిగింది. కానీ నేటికీ జిఒ జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కె.ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ కూలీరేట్లు జిఒ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన కూలీరేట్లు 2024 జనవరి నుంచి 14 నెలల ఏరియర్స్ చెల్లింపుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు. ఇఎస్ఐ అమలుకు ఆటంకంగా వున్న కోర్టు కేసులను ప్రభుత్వం ఉపసంహరించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. కూలీరేట్లు 25 నుంచి 28కి పెంచిన జిఒతో పాటు ఏరియర్స్ చెల్లింపుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, దసరా బోనస్, స్వీట్, యూనిఫాం, టిచ్చింగ్ ఛార్జీ, స్వీపర్ వేతనాల పెంపుకు సంబంధించిన సమస్యల్ని హమాలీ సంఘాల నాయకులతో తక్షణమే చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మార్చి 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా మండల కార్యాలయాల వద్ద ధర్నాలు, మార్చి 7న విజయవాడ ఎండి ఆఫీసు వద్ద జరిగే ధర్నాలలో పెద్ద ఎత్తున హమాలీలు పాల్గొని జయప్రదం చేయాలని వారు హమాలీలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే మార్చి 20 నుంచి సమ్మెకు దిగుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మజ్జి సింహాచలం, నిమ్మల వెంకట సుబ్రహ్మణ్యం, కవల గంగరాజు, కొప్పు సత్యనారాయణ, మద్దాల రంగారావు, జడ్జ్ వరలయ్య, సివిల్ సప్లయిస్ కార్మికులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా స్థావరాలపై దాడులు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధి చింతలపూడి మండలం తలార్లపల్లి గ్రామంలో చేసిన దాడిలో దేశావతు వేణుకు సంబంధించిన ప్లాస్టిక్ డ్రమ్ములో నిల్వ ఉంచిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, అతనిపై పరారీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని రాఘవపురంలో పెంకే విజయ్‌కుమార్ వద్ద నుంచి మూడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్‌విఎల్.నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

వరుస చోరీల్లో నిందితుని అరెస్ట్

తణుకు : తణుకు టౌన్, తణుకు రూరల్ స్టేషన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడిన ముద్దాయిని తణుకు టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.5.20 లక్షల విలువైన 69.5 గ్రాముల బంగారు వస్తువులు, 1,144 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి సంబంధించిన వివరాలను తణుకు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.కొండయ్య వెల్లడించారు. పెనుగొండ మండలం పెనుగొండకు చెందిన తానేటి ఆశీర్వాదం జల్సాలకు అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా చేసుకున్నాడని వివరించారు. ఈక్రమంలోనే తణుకు రూరల్ స్టేషన్ల పరిధిలో ముందుగా తాళాలు వేసి ఉన్న ఇళ్లను రెక్కీ చేసి, తాళం కప్పలను గునపాలతో, ఇనుప రాడ్డుతో బద్దలు కొట్టి లోపలకి ప్రవేశించి, విలువైన వస్తువులను దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. తణుకు పట్టణం పాతవూరులోని పశువుల ఆసుపత్రి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆశీర్వాదంను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి సుమారు రూ.69.5 గ్రాముల బంగారం, 1,144 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తణుకు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 1 కేసు, తణుకు రూరల్ స్టేషన్ పరిధిలో 3 కేసుల్లో చోరీలకు పాల్పడినట్లు విచారణలో తెలిపాడన్నారు. ఆశీర్వాదం ముద్దాయి పాత నేరస్తుడని, ముద్దాయిపై పెనుగొండ పోలీసు స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉందని, 2008 నుంచి తణుకు టౌన్, తణుకు రూరల్, ఇరగవరం, పాలకొల్లు టౌన్, రాజమండ్రి జిఆర్‌సి పోలీస్ స్టేషన్లలో సుమారు 40 కేసుల్లో అరెస్టు కాబడి అనేక సార్లు జైలుకి వెళ్లినట్లు తెలిపారు. జైలు శిక్ష అనుభవించినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదని, గత సంవత్సరం నవంబర్ 6వ తేదీన తణుకు సబ్‌జైలు నుంచి విడుదలైనట్లు తెలిపారు. అప్పటి నుంచి తణుకు టౌన్, రూరల్ స్టేషన్ల పరిధిలో నాలుగు దొంగతనాలకు పాల్పడినట్లు తెలియజేశారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఉంగుటూరులో 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉంగుటూరు మండలంలో 1,630 మంది ఓటర్లు ఉన్నారు. ఉంగుటూరులో మూడు పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల డిటి పోతురాజు వెల్లడించారు. పోలింగ్ కేంద్రం 318లో 461 మంది, పోలింగ్ కేంద్రం 319లో 596, పోలింగ్ కేంద్రం 320లో 573 మంది ఓటర్లు ఉన్నారు.

టి.నరసాపురంలో 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

టి.నరసాపురం : మండలంలో నేడు జరగనున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిటర్నింగ్ అధికారి టిఎస్.సాయిబాబా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 918 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, వారు ఎటువంటి ఇబ్బందులు పడకుండా రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

చాట్రాయి : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు చేశారు. మండలంలోని 1500 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల సౌకర్యార్థం సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి 132/33 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్.అహ్మద్‌ఖాన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 33 కెవి చింతలపూడి, 33 కెవి టి.నరసాపురం, 33 కెవి లింగపాలెం, 33 కెవి శంఖుచక్రపురం, 33 కెవి రాఘవపురం, 33 కెవి సీతానగరం, 33 కెవి శెట్టివారిగూడెం, 33 కెవి ప్రగతి సోలార్, 33 కెవి పట్టాయిగూడెం ఫీడర్ల పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆ రోజు త్రీ ఫేస్ కరెంట్ దశల వారీగా ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

రోడ్డు వెంబడి భారీ వృక్షాల వేర్లు

తొలగించాలని వాహనదారుల వేడుకోలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



రోడ్డు వెంబడి ఉన్న వృక్షాల వేర్లు

నూజివీడు పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తి ప్రయాణికులు, వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ తరుణంలో శ్రీనివాస సెంటర్ నుంచి గాంధీనగర్ వెళ్లే రహదారి వెంబడి నరికిన భారీ వృక్షాల వేర్లు అలాగే వదిలేశారు. దీంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రయాణికులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం కోర్టుకు, పోలీస్ స్టేషన్‌కు, సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే రహదారి వెంబడి వేసి ఉన్న మొద్దులను తొలగించే విషయంలో కనీసం ఏ ఒక్క అధికారి పట్టించుకోకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ఆర్అండ్‌బి, మున్సిపాలిటీ అధికారులు స్పందించి ఆ మొద్దులు, వేర్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ముందడుగు వేస్తున్నట్లు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. ఈ విషయంలో ప్రజలు కూడా పూర్తి సహకారం అందించాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. ఏలూరుకు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి వద్ద ఉన్న గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆశ్రం ఆసుపత్రి వద్ద ఉన్న గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. నూతనంగా మోటార్ ఏర్పాటు చేయడం, ట్రాన్స్‌ఫార్మర్ మార్పు చేయడం, తూడు తొలగింపు పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. వీటిని ఎంఎల్ఎ బడేటి చంటి అధికారులతో కలిసి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకెళ్లామన్నారు. దీనిపై స్పందించిన మంత్రి ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్‌తో మాట్లాడి, సమస్యను పరిష్కరించాలని ఆదేశించారని చెప్పారు. తగ్గిన నీటిమట్టాన్ని యధాస్థితికి తీసుకొస్తే వేసవిలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని, దీన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారులంతా సమిష్టిగా కృషి చేస్తున్నారని, ప్రజలు కార్పొరేషన్ అధికారులకు పూర్తి సహకారం అందించాలన్నారు. నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేషన్ ఎంఇ సురేంద్రబాబు, ఇరిగేషన్ జెఇ సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు వందనాల శ్రీనివాసరావు, ఆర్నేపల్లి తిరుపతి, తదితరులు ఉన్నారు.

వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు వెబ్ కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ప్రక్రియను బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా వెబ్ కాస్టింగ్ ట్రైయిల్ రన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన 456 పోలింగ్ కేంద్రాల్లో ప్రతి కదలిక వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజున వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణ బాధ్యతలను సంబంధిత సిబ్బంది నిబద్ధత కలిగి సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

నూజివీడు బాలోత్సవం నిర్వహణ ప్రాంగణం మార్పు

శ్రీ సారధి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలో వచ్చే నెల రెండో తేదీన జరిగే బాలోత్సవ కార్యక్రమం నిర్వహించే ప్రాంగణాన్ని మార్పు చేసినట్లు బాలోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీ సారధి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మార్పును స్కూల్స్, యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు గమనించి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు

పట్టిసీమకు పోటెత్తిన యాత్రికులు
బలివేకు లక్ష మందికి పైగా వచ్చిన వైనం
పులిహోర, మజ్జిగ అందించిన దాతలు



పోలవరం మండలంలోని పట్టిసీమలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పోలవరం

మహాశివరాత్రి సందర్భంగా పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలకు రాష్ట్రంలో నలుమూలల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజామున యాత్రికులు పట్టిసీమ చేరుకుని నదిలో స్నానాలు ఆచరించి స్నానాల ఘాట్లల పిండ ప్రదానాలు అర్పించారు. కొత్త జంటలు సరిగంగ స్నానాలు చేశారు. యాత్రికుల రద్దీతో క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం, శివక్షేత్రం, ఇసుక తిన్నెల్లో కాలినడక బాట, ఫెర్రీ రేవులు, స్నానాల ఘాట్లు, గోదావరిపై ఏర్పాటు చేసిన కాలినడక బాటలు నిండిపోయాయి. పోలీస్ అధికారుల నిరంతర పర్యవేక్షణ అడుగడుగునా రద్దీ నియంత్రణ వల్ల ఎలాంటి తోపులాటలు,



పోలవరం : యాత్రికులకు మజ్జిగ పంపిణీ

తొక్కిసలాటలు లేకుండా ఉత్సవాలు శాంతియుతంగా జరిగాయి. తెల్లవారుజామున ఆలయ వంశపారంపర్య ట్రస్టీలు కొచ్చర్లకోట వెంకట జగన్నాధరావు తదితరులు భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, ఫెర్రీ రేవు, ఇసుక తిన్నెల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు, ఆర్డబ్ల్యుఎస్ శాఖ ఏర్పాటు చేసిన వాటర్ ప్యాకెట్లు యాత్రికులు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ ఏడాది ఇసుక తిన్నెల్లో ఆరు ఉచిత అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. నదిపై రాకపోకలకు వేసిన పంట్లు, ఇసుక తిన్నెల్లో కాలినడక సౌలభ్యం కోసం వేసిన గోనె సంచుల బాట యాత్రికులకు ఎంతగానో సహకరించాయి. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు నదిలో స్పీడు బోట్లతో నిరంతర పర్యవేక్షణ చేశారు. ఆలయానికి ఆలయ ప్రాంగణం నుంచి ఫెర్రీ రేవు వరకూ వేసిన విద్యుద్దీపాలంకరణ యాత్రికులకు ఉపయోగపడింది. పోలవరం పంచాయతీ నూతనగూడెం, తాడిపూడి గ్రామాల్లో ప్రధాన రహదారిపై స్థానికులు పులిహోర ప్రసాదం, మజ్జిగను యాత్రికులకు పంపిణీ చేశారు. పట్టిసీమ ఫెర్రీ రేవులో హుకుంపేట జమిందారు సత్రం, రామకృష్ణ గీతాశ్రమం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉత్సవ ఏర్పాట్లను ఆర్‌డిఒ ఎం.వి.రమణ, భద్రతా ఏర్పాట్లను డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సిఐ బాల సురేష్ బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ స్వయంగా పర్యవేక్షించారు. కాలిబాటలకు దూరంగా వేసిన దుకాణాలు, ఇతర చిల్లర దుకాణాలు గోనె సంచుల కాలిబాట ప్రాంతాన్ని ఇరువైపులా ఆక్రమించడంతో యాత్రికుల రాకపోకలకు కొంతమేర అంతరాయం కలిగింది. లడ్డూ, పులిహోర ప్రసాదం కౌంటర్లు ఈ ఏడాది అదనంగా ఏర్పాటు చేయడం వల్ల యాత్రికులు సౌకర్యవంతంగా కొనుగోలు చేశారు. ఆలయ ప్రాంగణం నుంచి ఇసుక తిన్నెల్లో పలుచోట్ల ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు యాత్రికులకు ఎంతగానో ఉపకరించాయి.

ముసునూరు : మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని బలివే గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కళ్యాణం రోజున సుమారు లక్షకు పైగా యాత్రికులు వచ్చారని ఆలయ కార్యనిర్వాహణాధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు. తెల్లవారుజాము రెండు గంటల నుంచే తమ్మిలేరులో జల్లు స్నానాలు ఆచరించి అధిక సంఖ్యలో యాత్రికులు దర్శనానికి విచ్చేశారు. వివిధ సేవా ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో పులిహోర, చక్కెరపొంగలి, దద్దోజనం యాత్రికులకు ఉచితంగా అందించారు. ఆలయం తరపున మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు అందించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఏలూరు జిల్లా జడ్జి, పలువురు నాయకులు దర్శనానికి విచ్చేసిన సమయంలో సామాన్యులు కొంతమేర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ద్వారకాతిరుమల : యాత్రికులకు పులిహోర పంపిణీ

చాట్రాయి : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చాట్రాయిలో ఉన్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామిని యాత్రికులు దర్శించుకున్నారు. యాత్రికులు తెలంగాణ రాష్ట్రం నుంచి వివిధ ప్రాంతాల నుంచి స్నానాలు ఆచరించడానికి చాట్రాయి గ్రామం రావటం ఆనవాయితీగా మారింది. ఆలయ కమిటీ సభ్యులు యాత్రికుల సౌకర్యార్థం మహిళలకు ప్రత్యేక స్నానాల గదులు ఏర్పాటు చేశారు. యాత్రికులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. మండలంలో గుడిపాడు, తుమ్మగడెం జనార్ధనవరం, చిన్నంపేట గ్రామాల్లో పండుగను ఘనంగా నిర్వహించారు.

కాలినడక యాత్రికులకు పులిహోర వితరణ

ద్వారకాతిరుమల : మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని భవాని పీఠం వద్ద ఏలూరు తూర్పు వీధి నుంచి మహాశివరాత్రి సందర్భంగా ద్వారకా తిరుమల కాలి నడకన వెళ్లే యాత్రికులకు పులిహోర వితరణ కార్యక్రమం జరిగింది. ప్రతి ఏడాది పది వేల మంది యాత్రికులు కాలినడకన మహాశివరాత్రి సందర్భంగా ద్వారకాతిరుమల చేరుకుంటారు. ఈ ఏడాది నడిచి వచ్చే యాత్రికులకు తిమ్మాపురం భవానీ పీఠం వద్ద గద్దె రవీంద్ర, పర్వతనేని రాంబాబు ఆర్థిక సాయంతో పులిహోర, శీతల పానీయాలు, తాగునీరు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

విజయ జగదీశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

పోలవరం : పాత పట్టిసీమలో ఉన్న భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో కన్నాపురం అడ్డరోడ్డు వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు బాటసారులకు విజయ జగదీశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సుమారు పది వేల మంది యాత్రికులకు పదివేల లీటర్ల మజ్జిగ పంపిణీ చేసినట్లు కొవ్వాసు జగదీశ్వరి తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఈ చల్లని మజ్జిగను తమ ట్రస్ట్ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వాసు జగదీశ్వరి, విజయ నాయక్, జితేంద్ర, మోజేష్, పోతురాజు, నరేష్, మణికంఠ, బుజ్జిదొర, అప్పారావు, సత్యనారాయణ, తదిరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : శివరాత్రి సందర్భంగా మండలంలో ఉన్న శివాలయాలు ఉదయం నుంచే యాత్రికులతో కిటకిటలాడాయి. ఆగిరిపల్లిలోని శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత ముక్తేశ్వర ఆలయం, మెయిన్ సెంటర్ గంగా అన్నపూర్ణాసమేత ముక్తేశ్వర స్వామి ఆలయం, సూరవరంలోని ముక్తేశ్వరస్వామి ఆలయం, ఈదులగూడెంలోని పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయాల్లో పెద్ద సంఖ్యలో యాత్రికులు పోటెత్తారు. సాయంత్రం ఆగిరిపల్లి పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

కలిదిండి : స్థానిక శ్రీ పార్వతీ సమేత శ్రీ పాతాళ బోగేశ్వర స్వామి ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి విఎస్‌కె.శేఖర్ పర్యవేక్షించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తగు చర్యలు చేపట్టారు. పలు గ్రామాల నుంచి ప్రభలు, కళాకారులు డప్పు వాయిద్యాలు, నృత్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నాయి. ఆలయం వద్ద ఉచిత అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. తొలుత కైకలూరు ఎంఎల్ఎ శ్రీనివాస్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎఎంసి మాజీ ఛైర్మన్లు తాడినాడ బాబు, వల్లభనేని శ్రీనివాసచౌదరి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు అంద్రాజు శ్రీనివాసరావు, లంకా రత్నారావు, సర్పంచి ఎం.మారుతీప్రసన్న వెంకటేశ్వరరావు, టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, డిసి ఛైర్మన్లు, నీటి సంఘం అధ్యక్షులు, పలువురు స్థానిక నాయకులు ఆయనతో పాటు ఉన్నారు.



ముసునూరు మండలం బలివే ఆలయం వద్ద క్యూలైన్‌లో యాత్రికులు

పట్టిసీమలో అన్నదాన సత్రం నిర్వాహకుడు మృతి

పలువురు సంతాపం

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. పట్టిసీమ శివక్షేత్రం ఇసుక తిన్నెల్లో అన్నదాన సత్రం నిర్వహించడానికి వచ్చిన పోలవరం ఆర్యవైశ్య సంఘం నాయకులు వ్యాపారవేత్త మండవల్లి నాగవీరభద్రరావు(67) గుండెపోటుతో మృతి చెందారు. అన్నదాన సత్రం సమీపం నుంచి లఘుశంఖ తీర్చుకోవడానికి ఇసుక తిన్నెల్లో కొంతమేర నడిచి వచ్చిన ఆయన అన్నదాన సత్రం వద్దకు వచ్చేసరికి గుండెనొప్పితో కుప్పకూలిపోయారు. స్థానికంగా ఉన్న వైద్య సిబ్బంది సిపిఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఫెర్రీ ప్రాంతం వద్ద వైద్య శిబిరంలో ఉన్న వైద్యులు సమాచారం అందుకుని స్పీడు బోటుపై వెళ్లి పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గత ఎనిమిది దశాబ్దాలుగా మహాశివరాత్రి ఉత్సవాలల్లో అన్నదానం నిర్వహిస్తున్న ఆయన మండలంలో ఆధ్యాత్మిక కార్యకలాపాల్లో, దాన, ధర్మ కార్యకలాపాల్లో చేతికి ఎముక లేని వ్యక్తిగా పేరుగాంచారు. కాశీ, షిరిడీ, తిరుపతి, విజయవాడ పుణ్య క్షేత్రాల్లో అన్నదాన కార్యకలాపాలు, భక్తుల భవనాలు నిర్మించిన ఆయన మృతిపట్ల ఆర్యవైశ్య సంఘం, పోలవరం గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.